# Baptism of Our Lord – 11.01.2026 (Telugu)

**ప్రభువైన యేసు క్రీస్తు బాప్తిస్మోత్సవ పండుగ – సంవత్సరం A**

***యెషయా 42:1–4, 6–7; అపో. కార్యములు 10:34–38; మత్తయి 3:13–17***

**ముఖ్యమైన సందేశం (Red Thread):**

**యేసు బాప్తిస్మంలో వెల్లడైనట్లు, మనమంతా దేవుని ప్రియమైన బిడ్డలమనే గుర్తింపును తెలుసుకోవడం, దానిని అంగీకరించడం, మరియు ప్రతిరోజూ ప్రపంచానికి ఆయన వెలుగును తీసుకెళ్లే బాధ్యతను జీవించడం.**

## పరిచయం (Introduction)

**కొన్ని సంవత్సరాల క్రితం ఒక తండ్రి తన జీవితంలో మర్చిపోలేని ఒక సంఘటనను నాకు చెప్పారు.**

**అతని చిన్న కూతురు ఈత నేర్చుకుంటోంది. ఆమె నీటి కొలనుని అంచున నిలబడి, చాలా భయంతో ముందుకు అడుగు వేయలేకపోయింది. అప్పుడు తండ్రి నీటిలోకి దిగి, చేతులు చాచి, సాదాసీదాగా ఇలా అన్నాడు:**

**"నేను ఇక్కడ ఉన్నాను. నన్ను నమ్ము."**

**ఆ మాటలు వినగానే ఆమె ముఖం మారిపోయింది. ఆమె అకస్మాత్తుగా ధైర్యవంతురాలైనందుకే కాదు, తండ్రి స్వరం విని, తాను సురక్షితంగా ఉందని తెలుసుకున్నందుకే. ఆమె దూకింది — అలా ఒక కొత్త ప్రయాణం ప్రారంభమైంది.**

**ఈ రోజు మనం అలాంటి ఒక ఘట్టాన్నే జరుపుకుంటున్నాం. యేసు**

యోర్దాను నదిలోకి అడుగుపెడతాడు. ఆకాశం తెరుచుకుంటుంది. తండ్రి తన స్వరంతో ఇలా ప్రకటిస్తాడు:
"నీవు నా ప్రియ కుమారుడు; నిన్ను నేను ఎంతో ఇష్టపడుతున్నాను."
ఆ క్షణం నుండి యేసు తన ప్రేషిత కార్యాన్ని ప్రారంభిస్తాడు — ఒంటరిగా కాదు, సందేహంతో కాదు, తండ్రి ప్రేమలో స్థిరంగా నిలబడి.
మన బాప్తిస్మ సమయంలో కూడా దేవుడు ఇదే సత్యాన్ని మనపై ప్రకటించాడు:
నీవు నా ప్రియమైన కుమారుడవు . నిన్ను నేను పిలిచాను.

**ఉపన్యాసం:**

"ఆయన మన మధ్యకు దిగివచ్చాడు… తద్వారా మనం ఆయనయొద్దకు వెళ్ళేందుకు ."
కొన్ని సంవత్సరాల క్రితం ఒక విశ్వాసి తన మనవరాలి కథ చెప్పాడు. ఆమె ఐదో పుట్టినరోజుకు, ఆమెకు ఒక చిన్న భూగోళాన్ని (గ్లోబ్) బహుమతిగా ఇచ్చారు. ఆమె దానిని తిప్పుతూ, సముద్రాలు, పర్వతాలు చూపిస్తూ, ఒక రోజు అక్కడికి వెళ్లాలని కలలు కంటోంది. అప్పుడు ఆమె ఆగి, ఆస్ట్రేలియాను చూపిస్తూ ఇలా అడిగింది:
"తాతయ్యా, నేను ఇక్కడి నుంచే వచ్చానా?"
అతను చిరునవ్వుతో చెప్పాడు:
"అలా కాదు బంగారం. నీవు దేవుని దగ్గర నుంచే వచ్చావు — దేవుడు నీ కోసం గొప్ప ప్రణాళికలు కలిగి ఉన్నాడు."

ఆమె క్షణం ఆలోచించి, గ్లోబ్‌ను కౌగిలించుకుని ఇలా అంది:

“అయితే దేవుడు అన్నిచోట్ల ఉన్నాడన్నమాట… ఈ గ్లోబ్ లోకూడా!”

పిల్లల మాటలలోనే ఎంత లోతైన సత్యం దాగి ఉంటుంది.

ప్రభువైన యేసు బాప్తిస్మోత్సవం మనలను రెండు ప్రశ్నల వైపు తీసుకెళ్తుంది:

యేసు ఎక్కడి నుంచి వచ్చాడు?

మరి ఆయన ఎందుకు అలా దిగివచ్చాడు?

*1. యోర్దాను నదిలోకి దిగడం:*

ఒక యాత్రికురాలు శీతాకాలంలో యోర్దాను నదిని దర్శించిన అనుభవాన్ని ఇలా చెప్పింది.

ఆమె యోర్దాను నది ఒక గొప్ప నది, విస్తారమైన ప్రవాహం కనిపిస్తుందని అనుకొన్నది  కానీ ఆమె — సన్నని, మురికి నీరు, పక్కలలో పొదలు, తక్కువ ప్రవాహం గల నది ని చూసింది

ఆమె నిరాశగా అనుకుంది:

“ఇంత దూరం వచ్చింది ఇది చూడటానికా?”

అప్పుడు ఆమె మార్గదర్శి మెల్లగా చెప్పాడు:

“ఇక్కడే ఆకాశం భూమిని తాకింది.”

దేవుడు గొప్ప కృపను వెల్లడించేందుకు తరచుగా అత్యంత వినయమైన ప్రదేశాలనే ఎంచుకుంటాడు.

సువార్త చెబుతుంది:

“ఆ సమయంలో యేసు గలిలయ నుండి యోర్దాను వద్దకు వచ్చి,

యోహాను చేత బాప్తిస్మం పొందాడు."

యోర్దాను అంటే "దిగివెళ్లే నది" అని అర్థం కావచ్చు. యేసు ఆ దిగువకు వెళ్లే నదిలోకి దిగుతాడు. ఇది కేవలం భౌగోళిక దిగువ కాదు — ఇది ఆధ్యాత్మికమైన, తాత్త్వికమైన దిగువ.

యేసు జీవితం అంతా ఒక దిగివెళ్లే ప్రయాణమే:

- దేవుని మహిమ నుండి బలహీనమైన మానవత్వం లోనికి
- దైవత్వం నుండి ఆకలి, అలసటకు,
- పరలోకం నుండి నజరేతుకు,
- ఇప్పుడు పాపులతో కలిసి వరుసలో నిలబడి, మురికి నీటిలోకి.

పునీత పౌలు చెబుతాడు:

"ఆయన తనను తాను రిక్తున్ని చేసుకొని, సేవక రూపం ధరించాడు."

యేసు ఇంకా దిగుతూనే ఉన్నాడు — వంగుతూనే ఉన్నాడు — చిన్నవాడవుతూనే ఉన్నాడు.

ఒక వృద్ధ సన్యాసి అన్నట్టు:

"యేసు ఎక్కడికి వెళ్తున్నాడో చూడండి. ఆయన ఎప్పుడూ దిగువకే వెళ్తాడు — ఆయన వెళ్లిన చోటల్లా కృప దిగివస్తుంది."

## *2. యేసు ఎందుకు బాప్తిస్మం పొందాడు? – మూడు అంశాలు*

ఒక పాఠశాలలో పిల్లలను ఎత్తు ప్రకారం వరుసలో నిలబెట్టారు. ఒక పొడవైన బాలుడు ఉపాధ్యాయుల దగ్గర నిలబడ్డాడు. ఒక టీచర్ అతనితో అన్నాడు:

"నువ్వు ఈ వరుస దాటేసి, మా దగ్గర నిలబడొచ్చు."

అతను తల ఊపి ఇలా అన్నాడు:

“లేదు. నా స్నేహితులు అక్కడున్నారు. నేను వాళ్లతోనే నిలబడతాను.”

తరువాత ఆ టీచర్ అన్నాడు:

“ఆ రోజు నేను స్నేహం అంటే ఏమిటో నిజంగా నేర్చుకున్నాను.”

యేసు కూడా అలాగే చేస్తాడు.

యోహాను బాప్తిస్మకర్త ఆశ్చర్యపోతాడు:

“నన్ను నీవే బాప్తిస్మం చేయాలి; నీవు నా దగ్గరకు వస్తున్నావా?”

A. యేసు మన వరుసలో నిలబడతాడు

పునీత్ లూకా చెబుతాడు:

“ప్రజలందరూ బాప్తిస్మం పొందినప్పుడు, యేసు కూడా బాప్తిస్మం పొందాడు.”

B. తండ్రికి విధేయత — ఆయన జీవితం

“ఇప్పుడిలానే ఉండనివ్వు; ఇదే న్యాయాన్ని నెరవేర్చడం.”

C. దేవుని హృదయాన్ని వెల్లడించడం

ఆకాశం తెరువబడుతుంది.

ఆత్మ దిగివస్తుంది.

తండ్రి ప్రకటిస్తాడు:

“ఇతడు నా ప్రియ కుమారుడు.”

ఒక చిన్నారి క్లాసులో అన్నట్టు:

“యేసు దేవుని కుమారుడైతే, ఆయన బాప్తిస్మం అంటే దేవుడు ‘ఇదిగో — ఆయన చెప్పినట్టే కదా!”

*3. మన బాప్తిస్మం: దేవుడు మనకు అదే మాట చెప్పిన రోజు*

ఒక అమ్మమ్మ తన మనవళ్ల బాప్తిస్మ దీపాలను ఒక పెట్టెలో

దాచుకుంది.

ఆమె అన్నది:

"వాళ్లకు గుర్తుండదు, కాబట్టి నేను గుర్తుంచుకుంటాను. ప్రతి దీపం — దేవుడు ఒక పిల్లవాడిని ఆనందంగా చూసిన రోజు."

మన బాప్తిస్మాన్ని మనం కూడా అలా గుర్తుపెట్టుకుంటే ఎంత మంచిది!

ఆ రోజే దేవుడు మనతో అన్నాడు:

"నీవు నా ప్రియ కుమారుడివి. నా ప్రియ కుమార్తెవు. నిన్ను నేను ఇష్టపడుతున్నాను."

కానీ చాలామందికి ఈ స్వరం వినిపించదు.

షరతుల ప్రేమ, ప్రతిఫలాల ఆధారమైన ఆమోదం ఆ స్వరాన్ని ముంచేస్తుంది.

బాప్తిస్మం మాత్రం ఇలా ప్రకటిస్తుంది:

నీవు దేవునికి ప్రియమైన వాడివి

***ముగింపు (Conclusion)***

ఈ రోజు తండ్రి యేసును చూపించి అంటున్నాడు:

"ఇతడు నా ప్రియమైన వాడు "

నీ బాప్తిస్మంలో ఆయన నిన్ను చూసి కూడా అదే అన్నాడు.

కాబట్టి, క్రీస్తుతో కలిసి యోర్దానులోకి అడుగుపెడదాం —

వినయంతో, విధేయతతో, ప్రియమైన కుమారులుగా, కుమార్తెలుగా —

తండ్రి మన కోసం ఎదురుచూస్తున్న వాగ్దాన భూమి వైపు సాగిపోదాం.

ఆమెన్.

**Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.**